## క్లుప్తంగా

### గోడపత్రిక ఆవిష్కరణ

**నందిగామరూరల్:** పట్టణంలోని శతవార్షిక ముక్కోటి మహామండపంలో ఈనెల ఆరోతేదీ నుంచి శ్రీమద్రామాయణ పురాణ ప్రవచన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ముక్కోటి మహోత్సవ కమిటీ సభ్యులు దివి వెంకటరత్నమాచార్యులు తెలిపారు. స్థానిక ముక్కోటి మహామండపంలో శ్రీమద్రామాయణ పురాణ ప్రవచన గోడపత్రికను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల ఆరు నుంచి 14వతేదీ వరకు పురాణ ప్రవచనం తోపాటు గ్రంథ పూజ, నగర సంకీర్తన,తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. 14న సీతారామ కళ్యాణం, పట్టాభిషేక మహోత్సవాలు ఉంటాయన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### అమ్మవారికి అభిషేకాలు



**నందిగామరూరల్:** మండలంలోని అనాసాగరం శివారులోని కాదంబరి శ్యామక ఆశ్రమంలో ఆషాడ మాస ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాలలో భాగంగా గురువారం మాతాజీ శ్రీదేవి ఆధ్వర్యంలో ఆశ్రమంలోని వారాహి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు. ముందుగా సామూహిక కుంకుమార్చనలు, మూల మంత్ర హోమాది క్రతువులతోపాటు 108 కేజీల పసుపు కొమ్ములతో అమ్మవారి ఉత్సవమూర్తికి అభిషేకం నిర్వహించారు. 108 కేజీల బూడిద గుమ్మడికాయలతో దీవ ప్రజ్వలన, 108 కేజీల చెరుకుగడ మహా నివేదన అనంతరం పూర్ణాహుతి కార్యక్రమాలను వేదోక్తంగా జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### ముగిసిన నవరాత్రి ఉత్సవాలు



**ముక్త్యాల(జగ్గయ్యపేట):** గ్రామంలోని కోటి లింగ హరిహర మహాక్షేత్రంలో వేంచేసియున్న వారాహి అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు, హోమాలతోపాటు ప్రత్యేక అలంకరణలు, అభిషేకాలను అర్చకుడు తేజశర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని కేడీసీసీ చైర్మన్ నెట్టెం రఘురాం అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈవో హరిదుర్గా నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

### నోట్ పుస్తకాల పంపిణీ

**ధర్మవరప్పాడుతండ(జగ్గయ్యపేట):** మండలంలోని ధర్మవరప్పాడుతండ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం జగ్గయ్యపేట ఎల్ఐసీ డెవలప్‌మెంట్ అధికారి లక్ష్మణ్‌నాయుడు వితరణతో నోట్ పుస్తకాలు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి భయాందోళన లేకుండా విద్యనభ్యసించాలన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులకు మంచి బోధన అందించాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, సర్పంచ్ మణిహుస్సేన్, విద్యాకమిటీ చైర్మన్ దారావత్ రోజా, ఉపాధ్యాయులు మంగతాయమ్మ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

### సిలిండర్ పేలి మంటలు



**నందిగామరూరల్:** మండలంలోని కమ్మవారి పాలెంలో గ్యాస్ సిలిండర్ పేలి మంటలు వ్యాపించిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన కొట్టె నరసింహారావు హోటల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజూ మాదిరిగానే హోటల్ పని చేస్తుండగా ఒక్కసారిగా గ్యాస్ సిలిండర్ పేలడంతో మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖాధికారులకు సమాచారం అందించడంతో హుటాహుటిన అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో రూ. 30వేల ఆస్తినష్టం కలిగినట్లు అగ్నిమాపక శాఖాధికారులు అంచనా వేశారు.

### మునేటి ఆయకట్టుకు నీరు విడుదల

**పోలంపల్లి(వత్సవాయి):** మునేటి ఆయకట్టుకు సాగునీటిని శుక్రవారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆయకట్టు ద్వారా వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ మండలాలలోని 25 గ్రామాల్లోని 25 వేల ఎకరాలకు సాగునీరుందుతుందని చెప్పారు. మునేటిపై ఉన్న పాత ఆనకట్టకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసేందుకు రూ.19 కోట్లతో ప్రతిపాదనలను చేసి ప్రభుత్వానికి పంపినట్లు చెప్పారు. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభిస్తామని వివరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



- జుజ్జూరు గ్రామ శివారులో ఆర్అండ్‌బీ రహదారిపై ఉన్న మలుపు



ప్రమాదకరంగా దర్శనమిస్తున్న జగన్నాథపురం సమీపంలోని మలుపు

# ప్రమాదకరంగా రోడ్డు మలుపులు

**వీరులపాడు:** మండలంలోని ఆయా గ్రామాల పరిధిలోని ఆర్అండ్‌బీ రహదారులపై ఉన్న మలుపుల వద్ద వాహనదారులు నిత్యం ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా మండలంలోని జగన్నాథపురం, జుజ్జూరు గ్రామాలతోపాటు దొడ్డదేవరపాడు తోటమూల వద్ద ఉన్న మలుపులు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. రహదారులపై కనీసం సూచిక బోర్డులు కూడా లేకపోవటంతో మలుపులు ఉన్న విషయం కూడా తెలియక వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. దొడ్డదేవరపాడు తోటమూల వద్దనున్న మలుపు 'వై'ఆకారంలో ఉండటంతో ఎటువైపు నుంచి ఏ వాహనం వస్తుందో కూడా తెలియని పరిస్థితి నెలకొందని వాహనదారులు వాపోతున్నారు. రాత్రి వేళల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. ఈ మూలమలుపుల వద్ద తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నప్పటికీ ఆర్అండ్‌బీ అధికారులు మాత్రం ఎటువంటి ప్రమాద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయకపోతుండటం గమనార్హం. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ మలుపుల వద్ద ప్రమాదాలు చోటుచేసుకోకుండా ప్రమాద హెచ్చరికలను సూచించే బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనచోదకులు, ప్రజలు కోరుతున్నారు.



దొడ్డదేవరపాడు తోటమూల వద్ద 'వై' ఆకారంలోని మలుపు

# అల్లూరి సీతారామరాజుకు ఘననివాళి



పెనుగంచిప్రోలులో నివాళులర్పిస్తున్న ఎంపీపీ గాంధీ, ఎంపీడీఓ శ్రీను తదితరులు



నందిగామలో నివాళులర్పిస్తున్న ఆర్డీవో బాలకృష్ణ , తహసీల్దార్ సురేష్‌బాబు, అధికారులు

**కంచికచర్ల:** స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో మన్యంవీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఎంపీడీవో బీఎం విజయలక్ష్మి, సూపరిండింటెంట్ ఆనంద కమలకుమారి, డిప్యూటీ ఎంపీడీవో ఇందుపల్లి నానిబాబు నివాళులర్పించారు.

**నందిగామటౌన్:** మన్యం వీరుడు అల్లూరు సీతారామరాజును స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని ఆర్డీవో కె.బాలకృష్ణ సూచించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో అల్లూరి జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తహసీల్దార్ సురేష్‌బాబు, కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా బళ్లారి రాఘవ కళా సమితి ఆధ్వర్యంలో అల్లూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. సమితి అధ్యక్షుడు బబ్బెళ్లపాటి గోపాలకృష్ణ సాయి, కళాకారులు పాల్గొన్నారు.

**మున్సిపల్ కార్యాలయంలో..**

స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు. అల్లూరి చిత్రపటం వద్ద మున్సిపల్ కమిషనర్ లోవరాజు, మున్సిపల్ మేనేజర్ దేవి, సిబ్బంది నివాళులర్పించారు.

**పెనుగంచిప్రోలు:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు. అల్లూరికి ఎంపీపీ మార్కపూడి గాంధీ, ఎంపీడీవో జి.శ్రీను, డెప్యూటీ ఎంపీడీవో కె.సుబ్బారావు, ఏఓ సిద్ధారెడ్డి, ఏపీఓ జనార్దనరావు నివాళులర్పించారు.

**అల్లూరి జీవితం చరితార్థం : తన్నీరు**

**జగ్గయ్యపేటఅర్బన్:** దేశంకోసం తన జీవితాన్ని త్యాగం చేసిన అల్లూరి సీతారామరాజు జీవితం చరి



పేటలో అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

తార్థమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్(చిన్నా),పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, మండల అధ్యక్షుడు బూడిద నరసింహారావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**టీడీపీ ఆధ్వర్యంలో ...**

స్థానిక టీడీపీ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి ఎమ్మెల్యే తాతయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ మండల అధ్యక్షుడు కట్టా నరసింహారావు,కౌన్సిలర్ వెంకట్, సయ్యద్ అన్వర్, నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా వంగవీటి రంగా జయంతి వేడుకలు



నందిగామలో రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ జగన్‌మోహనరావు

**నందిగామటౌన్:** పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం తన తుదిశ్వాస వరకు పోరాడిన మహోన్నత వ్యక్తి మాజీఎమ్మెల్యే వంగవీటి మోహన రంగా అని నందిగామ మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు కొనియాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వీఎం రంగా జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గాంధీ సెంటరు, అనాసాగరంలోని రంగా విగ్రహాలకు డాక్టర్ జగన్‌మోహనరావు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ వీఎం రంగా పార్టీలు, కులమతాలకతీతంగా ప్రతి ఒక్కరికి మంచి చేశారన్నారు. ఆపార్టీ పట్టణ కన్వీనర్ మహ్మద్ మస్తాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాకలపాటి కృష్ణ, వైస్ఎంపీపీ ఆకుల హనుమంతరావు, జిల్లా అధికార ప్రతినిధి నెటకుదిటి శివనాగేశ్వరరావు, నాయకులు చిలుకూరి బుచ్చిరెడ్డి, షేక్ యాకుబ్ అలీ, కరి రవీంద్ర, ఓర్సు కొండ, స్టాలిన్, మాడుగుల మనోహర్, షేక్ సుభానీ, షేక్ మీరా, సింగంశెట్టి మల్లికార్జునరావు పాల్గొన్నారు.



రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న రాధారంగా మిత్రమండలి సభ్యులు

**కంచికచర్ల:** స్థానిక నెహ్రూబొమ్మ సెంటర్‌లో రాధా రంగ మిత్ర మండలి ఆధ్వర్యంలో మాజీఎమ్మెల్యే వంగవీటి మోహన్‌రంగా 78వ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత కేక్ కట్ చేసి, రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాధా రంగా మిత్రమండలి అధ్యక్షుడు ఉప్పు స్వామి, నాయకులు దేవిరెడ్డి విఘ్నేశ్వరరావు, దాసరి రాజా, గ్రంధి ప్రసాద్, శ్రీనివాసరావు, బచ్చు వెంకటేశ్వరరావు, చాపా సత్యనారాయణ, తుపాకుల రవి, దేవిరెడ్డి లక్ష్మీనారాయణ, కొత్తా రాజేష్, శివ, జొన్నల శ్రీనివాసరావు, జోరీగ కిషోర్, కొండేటి శివ, యర్రంశెట్టి బాలయ్య, నంబూరు మాధవ్, పాల్గొన్నారు.



పేటలో వీఎం రంగాకు నివాళులర్పిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

**టీడీపీ ఆధ్వర్యంలో..**

ఆత్మీయతతో ప్రజలకు సేవ చేస్తూ బడుగు, బలహీన వర్గాలకు అండగా ఉంటూ పేదల పక్షపాతిగా జీవించిన వంగవీటి రంగా సేవలు స్ఫూర్తిదాయకం అని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. కోదాడ రోడ్డులోని రంగా విగ్రహానికి రాజగోపాల్ పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, రంగా అభిమానులు పాల్గొన్నారు. జనసేన పార్టీ ఆధ్వర్యంలో కోదాడరోడ్డులోని రంగా విగ్రహానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా రంగా సేవాసమితి ఆధ్వర్యంలో వంగవీటి రంగా జయంతి వేడుకలను నిర్వహించారు. రంగా విగ్రహానికి కౌన్సిలర్ వట్టెం మనోహర్, సేవా సమితి ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**వీరులపాడు:** పెద్దాపురం గ్రామంలో వీఎం రంగా జయంతిని నిర్వహించారు. రంగా విగ్రహం వద్ద కంచికచర్ల ఏఎంసీ మాజీ చైర్మన్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, సర్పంచ్ నిప్పులపల్లి శాంతమ్మ, సొసైటీ మాజీ చైర్మన్ ఆవుల ప్రసాద్, ఉప సర్పంచ్ బవిరిశెట్టి లక్ష్మి నివాళులర్పించారు. అదేవిధంగా జుజ్జూరులో వీఎం రంగా విగ్రహం వద్ద గ్రామనాయకుడు పసుపులేటి సాయిబాబు నివాళులర్పించారు.

### జగ్గయ్యపేట నియోజకవర్గంలో..

**జగ్గయ్యపేటఅర్బన్:** బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఎంతో కృషిచేసిన వంగవీటి మోహనరంగా తెలుగు జాతి గర్వించే నేతగా ప్రతి పేదవాని గుండెల్లో నిలిచిన మహనీయుడని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం వీఎం రంగా జయంతిని ఘనంగా నిర్వహించారు. కోదాడ రోడ్డులోని రంగా విగ్రహానికి తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఇంటూరి రాజగోపాల్(చిన్నా), పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, మండల అధ్యక్షుడు బూడిద నరసింహారావు, రంగా అభిమానులు, పార్టీ నేతలు, మహిళా నేతలు నివాళులర్పించారు. అనంతరం నిరుపేదలకు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం ఎన్నో ప్రజాపోరాటాలు చేసిన రంగాను నేటి యువత ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, రంగా అభిమానులు పాల్గొన్నారు.

## వేదాద్రి ఎత్తిపోతల పథకం ప్రారంభించాలి. : సీపీఐ

**జగ్గయ్యపేటఅర్బన్:** జగ్గయ్యపేట మండల పరిధిలోని వేదాద్రి ఎత్తిపోతల పథకాన్ని వెంటనే ప్రారంభించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగ్గయ్యపేట నియోజకవర్గ సీపీఐ ద్వితీయ మహాసభ శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో సెంటర్‌లో ఉన్న బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో ఆ పార్టీ పట్టణ కార్యదర్శి జూనెబోయిన శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. శంకర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ వారి అభివృద్ధికి నిత్యం పోరాటాలు చేస్తున్న సీపీఐని బలోపేతం చేసేందుకు అందరూ సహకరించాలన్నారు.45ఏళ్ల తరువాత జగ్గయ్యపేటలో ఆగస్టు 1, 2వ తేదీల్లో పార్టీ జిల్లా మహాసభలు నిర్వహించుకోనున్నట్లు తెలిపారు. సీపీఐ సీనియర్ నాయకులు పొన్నం నరసింహారావు, వల్లంకొండ బ్రహ్మం, చుండూరు సుబ్బారావు, లంకా దుర్గారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు బుట్టి రాయప్ప, శివాజీ, పట్టణ కార్యదర్శి జె.శ్రీనివాసరావు, కనకపూడి బాబురావు, పోతిపాక వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# వీఆర్ఏలకు టైంస్కేలు అమలుచేయాలి

**నందిగామ రూరల్:** గ్రామ రెవెన్యూ సహాయకులకు తెలంగాణలో మాదిరిగా మనరాష్ట్రంలో కూడా టైం స్కేల్ అమలుచేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ డిమాండ్ చేశారు. ఈనెల 9న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నట్లు వీఆర్ఏల సంఘ నాయకులు శుక్రవారం మండల తహసీల్దార్ సురేష్‌బాబును కలిసి నోటీసు అందజేశారు. ఈసందర్భంగా గోపాల్ మాట్లాడుతూ విఆర్ఏలకు నైట్ డ్యూటీలు, ఇసుక రీచ్‌లు, రైస్ మిల్లుల వద్ద వేస్తున్న అక్రమ డ్యూటీలను రద్దు చేయాలని కోరారు. రీసర్వేలకు టీఏ, డీఏలను చెల్లించాలన్నారు. ప్రమాదంలో మృతి చెందిన వీఆర్ఏల కుటుంబానికి రూ.10 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా లేబర్ కోడ్‌ను రద్దు చేసి వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. 9న నిర్వహించే సమ్మెల్యే వీఆర్ఏలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏల సంఘ నాయకులు కుక్కల శ్రీను, ఫాతిమా, వీఆర్ఏలు పాల్గొన్నారు.



తహసీల్దార్ సురేష్‌బాబుకు సమ్మె నోటీస్ అందజేస్తున్న గోపాల్, శ్రీను, ఫాతిమా

# పైలెట్ ప్రాజెక్టులు పరిశీలన

**చెవిటికల్లు(కంచికచర్ల):** పైలెట్ ప్రాజెక్టుల ద్వారా అన్ని గ్రామాలకు తాగునీరు సరఫరా అయ్యేలా సంబంధిత సిబ్బంది, అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బీఎం విజయలక్ష్మి సూచించారు. మండలంలోని చెవిటికల్లు కృష్ణానదిపై నిర్మించిన కంచికచర్ల, బత్తినపాడు పైలెట్ ప్రాజెక్టులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టుల ద్వారా వీరులపాడు, కంచికచర్ల మండలాల్లోని గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుందని, అయితే ప్రతి గ్రామానికి తాగునీరు సరఫరా అయ్యేలా అధికారులు, సిబ్బంది చూడాలన్నారు. ప్రధాన పైపులైన్లు మరమ్మతులకు గురైతే వెంటనే బాగు చేయించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం తాగునీటి పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ నానిబాబు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



చెవిటికల్లు పైలెట్ ప్రాజెక్టు వద్ద నీటి నాణ్యతను పరిశీలిస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి

## ముఠా కార్మికులకు తీరని అన్యాయం: సీఐటీయూ

**నందిగామరూరల్:** ముఠా కార్మికులకు చట్టాలను అమలుచేయకుండా పాలకులు దగా చేస్తున్నారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ విమర్శించారు. స్థానిక రైతుబజార్ వద్ద హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాలుగో మహాసభ కరపత్రాన్ని రైతుబజారు ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులతో కలిసి శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15న తిరువూరులో హమాలీ వర్కర్స్ యూనియన్ మహాసభ జరుగుతుందన్నారు. ఎగుమతులు, దిగుమతుల్లో ముఠా కార్మికులు కీలకపాత్ర పోషిస్తున్నా ప్రభుత్వాలు మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ముఠా కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేస్తామని టీడీపీ మేనిఫెస్టోలో ప్రకటించిందని, అధికారంలోకి వచ్చి ఏడాదికైనా హామీ అమలుకు నోచుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ముఠా ఆటోలు, ట్రాలీలపై పోలీసులు చలానాలు విధిస్తూ, కేసులు పెడుతూ వేధిస్తున్నారని మండిపడ్డారు. అన్నిరకాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు షేక్ రఫీ, మరియన్న, దేవరాజు, శివకృష్ణ, ముక్కంటి, బాలస్వామి పాల్గొన్నారు.



జిల్లా మహాసభ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న గోపాల్, నాయకులు

# మాజీ సీఎం రోశయ్యకు ఘననివాళి

**నందిగామరూరల్:** ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నర్‌గా కొణిజేటి రోశయ్య అందించిన సేవలు మరువలేనివని ఆర్యవైశ్య సంఘం నాయకులు మారం అమరయ్య, పారేపల్లి సాయిబాబు కొనియాడారు. పట్టణంలోని మెయిన్‌బజార్, వాసవీ మార్కెట్ వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మాజీ సీఎం కొణిజేటి రోశయ్య జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ శాసనసభలో 15 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఘనత రోశయ్యకే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు రాచూరి సీతారామ్, వరిశ మల్లికార్జునరావు, దేవత పద్మజారాణి, చలపాటి పార్థసారధి, కేతేపల్లి సత్యంబాబు, చవట సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

**జగ్గయ్యపేటలో..**

**జగ్గయ్యపేటఅర్బన్:** మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతిని పురస్కరించుకుని ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో ఏర్పాటుచేసిన రోశయ్య విగ్రహానికి శుక్రవారం ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) టీడీపీ నాయకుడు శ్రీరాం చినబాబు, ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ మాజీ సీఎం రోశయ్య రాజకీయాల్లో నైతికతకు నిలువెత్తు నిదర్శమని కొనియాడారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు. అదేవిధంగా రోశయ్య విగ్రహానికి జనసేన జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను పూలమాలలు వేసి నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

# రోడ్లపై చెత్త వేస్తే చర్యలు : కమిషనర్

**నందిగామరూరల్:** మున్సిపాలిటీ పరిధిలో రోడ్లపై చెత్త వేస్తే సహించేది లేదని మున్సిపల్ కమిషనర్ లోవరాజు హెచ్చరించారు. పట్టణంలోని ఆయా వార్డుల్లోని ప్రధాన వీధులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తను రోడ్లపై వేయకుండా చెత్త కుండీలను వినియోగించాలన్నారు. ముఖ్యంగా రోడ్లపై చెత్త వేసే వారిని గుర్తించి జరిమానా విధిస్తామన్నారు. వ్యాపారులు కూడా చెత్తను రోడ్లపై వేయకుండా పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలని సూచించారు. ఆయా ప్రాంతాలలోని రోడ్ల వెంబడి వేసిన చెత్తను తొలగించే పనులను పర్యవేక్షించారు. అనంతరం మునేటికి ఎగువ నుంచి వస్తున్న వరదను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్ల పక్కన చెత్త తొలగింపు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ లోవరాజు

# లయన్స్ క్లబ్ సేవలను విస్తృతం చేయాలి

**నందిగామటౌన్:** లయన్స్ క్లబ్ ద్వారా అందిస్తున్న సేవలను రానున్న కాలంలో మరింత విస్తరించాలని క్లబ్ జిల్లా గవర్నర్ వివిపిఎస్ ఆంజనేయులు సూచించారు. స్థానిక రామకృష్ణా ప్లాజాలో క్లబ్ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమాలే పరమావధిగా పనిచేయాలన్నారు. అనంతరం అధ్యక్షుడు మాలెంపాటి ప్రసాదరావు, కార్యదర్శి చెరుకుమల్లి శ్రీనివాసరావు, కోశాధికారి లక్ష్మీకాంత్ పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో వైస్ గవర్నర్లు ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, నివృతరావు పాల్గొన్నారు.

### మాదిగ మహా మేళాకు తరలిరండి

**నందిగామరూరల్:** ఈనెల ఏడోతేదీన ఒంగోలులో మాదిగ మహామేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కనకపూడి వెంకటరత్నం మాదిగ తెలిపారు. మండలంలోని చందాపురంలో మాదిగ మహామేళా కరపత్రాన్ని శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. నాయకులు మల్లయ్యమాదిగ, హనుమంతరావు మాదిగ, స్వామి మాదిగ, శేషయ్య మాదిగ పాల్గొన్నారు.